క్లుప్తంగా

ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు ఈ నెల 28న స్పాట్ అడ్మిషన్లను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మార్చి 2023వ సంవత్సరంలో 10వ తరగతి పాసైన విద్యార్థులు(బాలురు) తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

కేసీఆర్ అవకాశవాది: సీపీఐ



గద్వాల అర్బన్: సీఎం కేసీఆర్ అవకాశవాది అని, అవసరాన్ని బట్టి అబద్ధాలు చెప్తారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు విమర్శించారు. కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని, జిల్లా కేంద్రంలో రాజీవ్‌మార్గ్ రోడ్డులో ఏఎన్ఎంలు చేపట్టిన సమ్మె శనివారంతో 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు ఏఎన్ఎంలు 11 రోజులు సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ రంగన్న, పద్మ, సరస్వతి, రేణుక, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

రాయిచూర్ రూరల్ ఎమ్మెల్యేకు సన్మానం

గద్వాల అర్బన్: రాయిచూర్ రూరల్ ఎమ్మెల్యే బస్సన్న గౌడ్ శనివారం గద్వాలకు వచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్ రెడ్డితో పాటు నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. నారాయణ రెడ్డి, శివరాజ్, జమాల్, ఇలియాస్ తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన

మానవపాడు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం చివరి నుంచి గాంధీచౌక్ వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని డీఈ కిరణ్‌కుమార్ తెలియజేశారు. శనివారం మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. దామోదర్‌రెడ్డి, వెంకట్రాములు, ఆనంద్‌బాబు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే అవినీతితోనే అభివృద్ధికి నోచుకోలే'..



ఎర్రవల్లిచౌరస్తా: ఎమ్మెల్యే అవినీతితోనే అలంపూర్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని బీఆర్ఎస్ యువజన నాయకుడు కిశోర్ అన్నాడు. శనివారం ఇటిక్యాల మండల పరిధిలోని బీచుపల్లి సాగర్ పంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే అబ్రహం ఒంటెద్దు పోకడంతో పాటు పార్టీ నాయకులను, కార్యకర్తలను సక్రమంగా పట్టించుకోకపోవడంతో కేసీఆర్‌పై ప్రజల్లో వ్యతిరేఖత పెరిగిందన్నారు. నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు అబ్రహంను ఎమ్మెల్యే అభ్యర్థిగా కోరుకోవడం లేదన్నారు. అనంతరం పంక్షన్ హాల్ నుంచి బీఆర్ఎస్ జెండాలతో నాయకులు, కార్యకర్తలతో జాతీయ రహదారి వరకు ర్యాలీని చేపట్టి అబ్రహం అభ్యర్థిత్వాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు ప్లకార్డులతో నినాదాలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువసైన్యం సభ్యులు, తదితరులు ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి



మల్దకల్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ తీరును ఎండగడుతూ ప్రజల పక్షాన పోరాటం చేయాలని కర్ణాటక రాష్ట్రం శివమొగ్గకు చెందిన ఎమ్మెల్సీ డీఎస్ అరుణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీజేపీ మండల అధ్యక్షుడు అల్వాల రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విధాన్ సభ ప్రవాస్ యోజన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కర్ణాటకలో వాల్మీకులు ఎస్టీ జాబితాలో ఉన్నారని, ఇక్కడ కూడా అదే తరహాలో డీకే అరుణ కేంద్రంతో ఒత్తిడి తెచ్చి అమలయ్యేలా చూస్తుందన్నారు. అంతకు ముందు ఆదిశిలా క్షేత్రంలో ఆయన పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాముడు, నాగరాజు, రాజశేఖర్, జనార్దన్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలే మానవాళికి జీవనాధారం



శాంతినగర్‌లో మొక్క నాటుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

అలంపూర్: మొక్కలే మానవాళికి జీవనాధారమని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. అలంపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో హరితహారంలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ శనివారం మొక్కలు నాటారు. మొక్కలు నాటడంతో ప్రకృతి వైపరీత్యాలను నివారిస్తాయన్నారు. ప్రతి పౌరుడు తప్పనిసరిగా మొక్కలు నాటాలన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ శేఖర్ రెడ్డి, కమిషనర్ నిత్యానంద్, కో-ఆప్షన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

మానవపాడు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి ముషాహీదాబేగం అధ్యక్షతన శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

అలంపూర రూరల్: మొక్కలే మానవ మనుగడకు జీవనాధారం అని ఎంపీపీ చంద్రకళ అన్నారు. ఒక్కరోజు కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా అలంపూర్ మండల పరిధిలోని ప్రతి గ్రామ పంచాయతీలో వెయ్యి మొక్కలు నాటారు. క్యాతూర్‌లో ఎంపీపీ చంద్రకళ, మండల వైద్యాధికారిణి ప్రసూనరాణి, మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్ మొక్కలు నాటారు. కార్యదర్శి, ఏఈఓ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించుకుందాం

అయిజ: మొక్కలు నాటి, సంరక్షించి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ఎంపీడీఓ సాయిప్రకాష్ అన్నారు. శనివారం మండలంలోని ఉప్పల క్యాంప్‌లో ఒకరోజు కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రభావతితో కలిసి మొక్కలు నాటారు. ఏపీఓ శరత్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్, రాజశేఖర్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో లక్ష్యం చేరాలి

రాజోళి: మొక్కల పెంపకంలో ప్రతిగ్రామం లక్ష్యాన్ని చేరుకోవాలని ఎంపీడీఓ గోవిందు రావ్ అన్నారు. శనివారం మండలంలోని మాన్‌దొడ్డి, చిన్నధన్వాడలో కోటి మొక్కల హరితహారంలో ఆయన పాల్గొన్నారు.

గద్వాల: జిల్లా కేంద్రాన్ని హరిత పట్టణంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. శనివారం హరితహారం సందర్భంగా అంబరాలేఅవుట్‌లో మొక్కలు నాటిన అనంతరం ఆయన మాట్లాడారు. మొక్కలను నాటడం సామాజిక బాధ్యతగా గుర్తించి హరితహారంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కలను ధ్వంసం చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ నర్సింహ, డీఈ సందీప్ పాల్గొన్నారు.

- వెంకంపేట ప్రభుత్వ పాఠశాల ఆవరణలో, ఎంఈఓ కార్యాలయ ఆవరణలో విద్యాశాఖ అధికారులు విరివిరిగా మొక్కలు నాటారు. డీఈఓ సిరాజుద్దీన్ మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండల పరిధిలోని అల్వలపాడులోని పాఠశాలలో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. నా మట్టి- నా దేశం పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. సరిత, ఆంజనేయులు, నీలావతి పాల్గొన్నారు.

మానవ మనుగడకు..

మల్దకల్: మానవ మనుగడకు చెట్లే జీవనాధారమని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. శనివారం మండలంలోని అమరవాయి, మల్దకల్ గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రతి గ్రామ పంచాయతీలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ రమేష్‌లింగం, ఎంపీఓ స్వామి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు

శాంతినగర్: ఒకే రోజు కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు శనివారం మొక్కలు నాటారు. సుజాత, అధికారులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీపీ మనోరమ అన్నారు. శనివారం మండలంలోని సిద్దన్‌పల్లిలో పాఠశాల హరితహార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా ఎంపీపీ మనోరమ, జెడ్పీటీసీ రాజశేఖర్ హాజరై హరితహారం మొక్కలు నాటారు. శంకరమ్మ, ఎంపీడీఓ మహ్మద్ అజార్ మోహిద్దీన్, ఎంపీఓ సయ్యద్‌ఖాన్, చక్రధర్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తాలో మొక్కలను జెడ్పీ సీఈఓ ముషాయిదా బేగం పరిశీలించారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం..

అయిజ: మొక్కలను విరివిగా నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య అన్నారు. శనివారం పట్టణ సమీపంలోని కర్నూల్ రోడ్డు పక్కన పది శాతం వెంచర్‌లో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్నతో కలిసి ఒకరోజు కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏఈ గోపాల్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాన్‌దొడ్డిలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ, సర్పంచ్‌లు



అలంపూర్‌లో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ



గద్వాలలో మొక్కలు నాటుతున్న చైర్మన్ బీఎస్ కేశవ్

అబద్ధాలతో మోసం చేయలేరు



విలేకరులతో మాట్లాడుతున్న డీకే స్నిగ్ధారెడ్డి

గద్వాల రూరల్: మీ అబద్ధాలతో ఇంకెంత కాలం ప్రజలను మోసం చేస్తారు.. గత ఎన్నికల్లో కూడా ఇదే తరహాలో ముసలికన్నీరు పెడుతూ ప్రజలను మోసం చేశారు.. మళ్లీ మీఅబద్ధాలతో ఇంకెంత కాలం ప్రజలను మోసం చేస్తారని బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి సర్పంచ్ బండ్ల జ్యోతిని ఉద్దేశించి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. శనివారం ఆమె డీకే బంగ్లాలో విలేకరులతో మాట్లాడారు. అన్యాయం జరిగినపుడు న్యాయస్థానాలను ఆశ్రయించి న్యాయం కోరడం సహజమని, దాన్ని కూడా జీర్ణం చేసుకోలేక తమకేదో అన్యాయం జరిగిందని కోర్టుకెళ్లిన క్లయింట్ దిష్టిబొమ్మను దహనం చేసే సంస్కృతి మీకే చెల్లిందని ఎద్దేవా చేశారు. గద్వాలలో మీ కుటుంబం తప్ప ఒక్కరు కూడా అభివృద్ధి చెందలేదని, మీరే ల్యాండ్‌మాఫీయా, నడిపిస్తూ పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇస్తానని పేదలను మోసం చేశారన్నారు. గద్వాలలో అభివృద్ధి ఎవరి హయాంలో జరిగిందో ప్రజలను అడిగితే చెబుతారన్నారు. మీరు చెబుతున్న మెడికల్, నర్సింగ్ కాలేజీలు గద్వాల జిల్లా అయినందుకే వచ్చాయని ఆ జిల్లా అరుణమ్మ కృషితోనే సాధ్యపడిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, సంజీవ్‌భరద్వాజ్, కృష్ణవేణి, రమాదేవి, జయశ్రీ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అలంపూర్ రూరల్: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2001–2002లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు శనివారం ఆత్మీయత సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. 21ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థులు కలుసుకుని పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. కార్యక్రమనికి ముఖ్యఅతిథులుగా మండల విద్యాధికారి అశోక్‌కుమార్ హాజరయ్యారు. విశ్రాంత ఉపాధ్యాయులు మల్లయ్య, శ్రీనివాసులు, మద్దిలేటి, సువార్తమ్మ, ప్రస్తుత ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు సర్వేశ్వర్, శేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



కారుపాకులలో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెల్లో మౌలిక సదుపాయాలను కల్పించి అభివృద్ధి చేయడమే ప్రభుత్వం ధ్యేయమని అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ వీ.ఎం అబ్రహం అన్నారు. శనివారం ఇటిక్యాల మండలంలో రూ.45 లక్షల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు, ఎర్రవల్లిలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు, కారుపాకులలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు, ఆర్.గార్లపాడులో రూ.5 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజల అభివృద్ధి కోసం కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి గ్రామంలో ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పల్లెప్రకృతి వనాలను, నర్సరీలను, ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. మహేశ్వరెడ్డి, జయచంద్రారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, గిడ్డారెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్‌కే ప్రజా మద్దతు

అలంపూర్: రాష్ట్రంలోని ప్రజల మద్దతు సీఎం కేసీఆర్‌కే ఉందని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహంను అయిజ మున్సిపాలిటీకి చెందిన పలువురు నాయకులు శనివారం కలిశారు. సీఎం కేసీఆర్ అలంపూర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించడంతో ర్యాలీగా క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. ఏబు, బాలరాజు, దేవరాజు పాల్గొన్నారు.

అధిక మెజార్టీతో గెలిపిద్దాం

అయిజ: అలంపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి అబ్రహంను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని బీఆర్ఎస్ నాయకులు సంకాపురంరాముడు, 14వ వార్డు కౌన్సిలర్ సీఎం సురేష్ అన్నారు. శనివారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయం, ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో వేర్వేరుగా బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్ అలంపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అబ్రహంకు అవకాశం కల్పించారని, అది గిట్టని కొందరు బీఆర్ఎస్ నాయకులు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని వాపోయారు.


ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల పరిధిలోని ఎర్రవల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు లోకారెడ్డి కాలుకి ఇటీవల గాయమై ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అబ్రహం ఎర్రవల్లికి చేరుకుని బాధితుడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మహేశ్వర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు ఉన్నారు.

సామాన్య ప్రజలకు పథకాలు ఇవ్వాలి



అలంపూర్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సామాన్య ప్రజలకు అందించాలని బీఎస్పీ ఉండవెల్లి మండల అధ్యక్షుడు ప్రభుదాసు డిమాండ్ చేశారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీసీ, ముస్లిం మైనార్టీ, దళితబంధు పథకాలు బీఆర్ఎస్ నాయకులకే వస్తున్నాయన్నారు. సామాన్య ప్రజలకు ఈ పథకాలు రావడం లేదన్నారు. సమావేశంలో బీఎస్పీ నాయకులు అయ్యన్న, శివశంకర్ గౌడ్, రాజు, రాముడు తదితరులు ఉన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం..



అలంపూర్: సమాజంలో పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని జిల్లా నోడల్ అధికారి హృదయరాజు అన్నారు. అలంపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హరితహారంలో భాగంగా శనివారం మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కలు నాటి పెంచడంతో వాతవరణం సమతుల్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సృజన, సుధారాణి, వెంకటరాణి, ఎస్.రాముడు, రామచంద్రయ్య, రఘువీర్ పాల్గొన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి



మాచర్లలో చెక్కులను అందజేస్తున్న ఎంపీపీ, బ్యాంకు మేనేజర్లు

గట్టు: మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని, దీనికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ తోడుగా ఉంటుందని డీఆర్‌డీఓ ఉమాదేవి తెలిపారు. శనివారం మాచర్లలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా మహిళా సంఘాల్లోని సభ్యులకు వ్యాపారాలు చేసుకునేందుకు ఆర్థిక సాయం అందజేశారు. టెంట్‌హౌస్ కోసం శారదకు రూ.2 లక్షలు, సంధ్యకు, మల్లమ్మకు, సరస్వతికి రూ.50 వేల చొప్పున చెక్కులను డీఆర్‌డీఓ ఉమాదేవి, ఎంపీపీ విజయ్‌కుమార్, మాచర్ల యూనియన్ బ్యాంకు మేనేజర్ పార్థివన్ అందజేశారు. ఎంపీటీసీ షమీమ్‌బేగం, భీమన్న, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నెమలి అప్పగింత

మానవపాడు: మండల కేంద్రంలోని నాగులకుంట కాలనీలోకి జాతీయ పక్షి నెమలి వచ్చింది. దీంతో చుట్టు పక్కల గ్రామస్తులు గొల్ల వెంకట్రాములు, యూసుఫ్, రాజ్ తీసుకెళ్లి పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్ తిమ్మన్నకు శనివారం రాత్రి అప్పగించారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



ఉత్తనూరులో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ షహిదా బేగం

అయిజ: స్పెషల్ క్యాంపింగ్ డే సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ షహిదాబేగం సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన వసతుల గురించి తెలుసుకున్నారు. అదేవిధంగా మండలంలోని ఉత్తనూరు, భూంపురం, మూగోనిపల్లి, తొత్తినోనిదొడ్డి, సింధనూరు, కుటుకనూరు గ్రామాల్లో బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బీఎల్‌ఓలు నిబంధనల మేరకు పనిచేయాలని, ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే సంబంధిత అధికారులకు తెలియజేయాలని పలు సలహాలు, సూచనలు చేశారు.

బడిబయటి పిల్లలను బడిలో చేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

గట్టు: బడిఈడు పిల్లలను తప్పనిసరిగా బడిలోనే చేర్పించాలని ఎంఈఓ కొండారెడ్డి సూచించారు. శనివారం గట్టు ఎమ్మార్సీలో ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కొండారెడ్డి మాట్లాడారు. బడి మధ్యలో మానేసిన పిల్లలను గుర్తించి, వారిని బడికి పంపేలా తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ఎంవీఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ సాయికుమార్ మాట్లాడారు. తరగతి గదుల్లో విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధన సాగాలన్నారు. పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని, పిల్లల తల్లిదండ్రులు వారి పిల్లలను మధ్యలో బడిని మాన్పించకుండా బడిలో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 14 ఏళ్లలోపు బాలబాలికలతో పనులు చేయించడం నేరమన్నారు. కార్యక్రమంలో ఎంవీఎఫ్ కార్యకర్తలు అమరేష్, నరేష్, వీరేష, ఫాతిమా, వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు సంఘటితం కావాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్

గద్వాల అర్బన్: కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని, హక్కుల పరిరక్షణకు కార్మికవర్గం సంఘటితం కావాల్సిన ఆవసరం ఉందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని వాల్మీకి కమ్యూనిటీ హాల్‌లో ట్రేడ్ యూనియన్ ముఖ్య కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు చేసి కార్మికవర్గంపై దాడులకు పూనుకుందన్నారు. దేశంలోని ఖనిజ సంపద, గనులు, అడవులు, గ్యాస్, పెట్రోలియం, ప్రభుత్వ రంగ సంస్థలను విదేశీ పెట్టుబడిదారులకు కారుచౌకగా కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శిక్షణ తరగతుల్లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి వివి నర్సింహ, అంజి, నర్సింహులు, తిమ్మప్ప, తిరుమల, జయన్న, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



సంకాపురంలో దాసంగాలు పెడుతున్న భక్తులు



శాంతినగర్‌లో జలాలను తీసుకొస్తున్న రైతులు

అయిజ: వర్షాలు కురువాలని మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా మండలంలోని సంకాపురం గ్రామ సమీపంలో వెలిసిన గాయత్రి- ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మాస శనివారాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు గణేషాచారి ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాల ప్రజలు ఆలయం వద్దకు చేరుకుని దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను ఎడ్ల బండిపై గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ.. శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థ ప్రసాదాలు, భోజన వసతి కల్పించారు.

వర్షం కోసం పూజలు

శాంతినగర్: పంటలు ఎండుతున్నాయని, వరుణదేవుడు కరుణించి వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ వడ్డేపల్లి మండల పరిధిలోని తిమ్మాజిపల్లి గ్రామ రైతులు, ప్రజలు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. 21 కాడెద్దులతో బీచుపల్లి పుణ్యక్షేత్ర సమీపంలో ప్రవహిస్తున్న కృష్ణానదికి శుక్రవారం వెళ్లారు. బీచుపల్లి ఆంజనేయస్వామి వారికి శనివారం ఉదయం ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం పవిత్ర జలాలను బిందెలో గ్రామానికి తీసుకొచ్చారు. గ్రామంలో వెలిసిన బండమిట్ట ఆంజనేయ స్వామి వారికి జలాభిషేకంతో పాటు పంచామృతాభిషేకం నిర్వహించారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని కోట ఆంజనేయ స్వామి ఆలయం నుంచి డి.బూడిదపాడు ఆంజనేయ స్వామి ఆలయానికి 21 ఎద్దుల కాడెద్దులతో స్వామి వారి చిత్రపటాన్ని ఊరేగించారు. రైతు సంఘం సభ్యులు, గ్రామ రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వినతి



అలంపూర్‌లో తహసీల్దార్‌కు వినతి అందజేస్తున్న ఆశవర్కర్లు, సీఐటీయూ నాయకులు



రాజోళిలో తహసీల్దార్‌కు వినతి అందజేస్తున్న ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులు

అలంపూర్: ఆశ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ అన్నారు. అలంపూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆశ వర్కర్లకు జీతం ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ మంజులకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశవర్కర్లు వినతి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి మాట్లాడారు. ఆశ వర్కర్లకు వేతనంతో సంబంధం లేని పనులు చేయించుకుని, వెట్టి చాకిరీ చేయిస్తున్నారని విమర్శించారు. ఆశ వర్కర్లు నాగేశ్వరమ్మ, పద్మ, విజయమ్మ, రేణుక, అంజలి, చంద్రకళ, సుజాత తదితరులు ఉన్నారు.

ఆశా వర్కర్లపై చిన్న చూపెందుకు

రాజోళి: ఆశా వర్కర్లపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని సీఐటీయూ నాయకులు విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రం రాజోళిలో ఆశా వర్కర్లు చేస్తున్న సమ్మెకు ఆయన సంఘీభావం తెలియజేశారు.

తహసీల్దార్‌కు వినతి

మానవపాడు: ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతి అందజేశారు.